సాక్షి
పల్నాడు
గురువారం । 20 । జూలై । 2023



రైతుబజార్లల్లో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు): రైతుబజార్లల్లో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ధరల పట్టిక పాటించని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.



జగనన్న గోరుముద్ద పరిశీలన

వేమూరు: ఉమ్మడి గుంటూరు జిల్లా సీఈవో మోహనరావు బుధవారం వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును పరిశీలించారు.



రీసర్వేను సకాలంలో పూర్తిచేయాలి

తెనాలి: సంగంజాగర్లమూడి గ్రామ సచివాలయాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సందర్శించారు. రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

మిర్చిమిట్లు



గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

భారీగా పెరగనున్న సేద్యం

- పల్నాడులో జిల్లాలో రైతుల అమితాసక్తి
- మార్కెట్‌లో విత్తనాలకు గిరాకీ
- ఆర్బీకేల్లోనూ విక్రయిస్తున్న ప్రభుత్వం
- పత్తిలో నష్టాలతో మిరప వైపు రైతుల మొగ్గు

పల్నాడు జిల్లాలో మిర్చి సాగు ఇలా(హెక్టార్లలో)..	
గతేడాది	: 57,525
ఈ ఏడాది అంచనా	: 77,644
విత్తనాలు అవసరం (కిలోల్లో)	: 2,647

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా పెరగనుందని ఉద్యానవనశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో ధర బాగుండటంతో రైతాంగం మిరప సాగుపై ఎక్కువ దృష్టిపెడుతోంది. గతేడాది దిగుబడి బాగా రావడం, సరాసరి ధర రూ.20 వేల వరకు పలకడంతో రైతులు బాగా లాభపడ్డారు. అదే ఉత్సాహంతో ఈ ఏడాది రైతులు, కౌలు రైతులు పత్తికి బదులు మిర్చి సాగుకు ముందుకు వస్తున్నారు. గతేడాది పల్నాడు జిల్లాలో 57,525 హెక్టార్లలో మిర్చి సాగు జరిగింది. ప్రారంభంలో అధిక వర్షాలు, నల్లతామర పురుగు బెడదతో పంట దెబ్బతింది. పెట్టుబడులు పెరిగినా పంటను కాపాడుకున్న రైతులకు కొంత మెరుగైన దిగుబడులు రావడంతోపాటు ధర కూడా బాగా పలికి మేలుచేసింది. ఈ ఏడాది 77,644 హెక్టార్లలో మిర్చి సాగు ఉంటుందని ఉద్యానవనశాఖ అధికారలు అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు మొదలవ్వడంతో రైతులు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, పిడుగురాళ్ల వంటి చోట్ల మిరప సాగు మొదలైంది.

ఆర్బీకేలలో విత్తనాలు

మిర్చి రైతులకు విత్తనాల కొరత, నకిలీల బాధ లేకుండా ఆర్బీకేల్లోనే అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మరోవైపు ప్రైవేట్ మార్కెట్‌లోనూ గిరాకీకి అనుగుణంగా మిర్చి విత్తనాలు అందేలా ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లాకు 20 కంపెనీలకు చెందిన 2,647 కిలోల విత్తనాలు అవసరమని ఉద్యానవనశాఖ వ్యవసాయశాఖకు ఇండెంట్ పంపింది. జిల్లాలో ఆర్మూర్, జీనీ 2626, తేజా సిగ్మెంట్స్ రకాల విత్తనాలకు బాగా డిమాండ్ ఉంది.

కౌలుకు గిరాకీ..

ఈ ఏడాది రైతులు అధిక సంఖ్యలో మిరపసాగుకు సన్నద్ధమవుతుండడంతో కౌలు భూములకు గిరాకీ పెరిగింది. దేవుడి మాన్యాలు, స్థానికేతురుల భూములను సాగుచేయడానికి కౌలు రైతులు పెద్దసంఖ్యలో ముందుకు వస్తున్నారు. గతేడాది పిడుగురాళ్ల మండలంలో రూ.15 వేల నుంచి 18 వేలు ఉన్న కౌలు, ఈఏడాది రూ.25 వేల 30 వేల వరకు పలకడం గమనార్హం. మరోవైపు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కౌలురైతులకు సీసీఆర్ కార్డులు విరివిగా జారీ చేసి, రుణసదుపాయం కల్పించడంతో వారు సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈఏడాది జిల్లాలో 55 వేల సీసీఆర్ కార్డుల మంజూరు లక్ష్యం కాగా ఇప్పటికే 25,828 కార్డులను అధికారుల జారీ చేశారు.

అందుబాటులో విత్తనాలు



మిర్చికి మంచి ధర పలకడం, పత్తి పంటకు వస్తున్న తెగుళ్ల నేపథ్యంలో ఈ ఏడాది మిరప సాగు అధికంగా ఉంటుందని అంచనా వేశాం. ఖరీఫ్‌లో 77,644 హెక్టార్లలో సాగు జరుగుతుందని అంచనా. అందుకు అనుగుణంగా జిల్లాకు 2,647.10 కిలోల మిర్చి విత్తనాలు అవసరమని ఇండెంట్ పంపాం. ఆర్బీకేల ద్వారా కూడా రైతులకు మిరప విత్తనాలు అందుబాటులో ఉంచాం. బయట మార్కెట్‌లోనూ డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాల లభ్యత ఉంది.

– బీజే బెన్నీ, పల్నాడు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

పది ఎకరాల్లో సాగుకు సిద్ధం



మిర్చి ధర ఆశాజనకంగా ఉండటంతో గతేడాది ఆరు ఎకరాలు సాగు చేసి లాభాలు పొందా. ఆ ఉత్సాహంతో ఈ ఏడాది పది ఎకరాల్లో సాగు చేసేందుకు సన్నద్ధమయ్యా. విత్తనాలకు బాగా గిరాకీ ఉంది.

– నంద్యాల శివారెడ్డి, కామేపల్లి, పిడుగురాళ్ల మండలం

ధర బాగుంది



నాకు 20 ఎకరాల పొలం, ఐదు బోరుబావులు ఉన్నాయి. పత్తి పంటను రెండు నెలల కింద సాగు చేయగా దానికి తెగులు సోకి పంటను తీసేయాల్సి వచ్చింది. మరోవైపు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది మిరపసాగు ఎక్కువ చేయాలని నిర్ణయించుకున్నా. నర్సరీ నుంచి మిరప నారు తీసుకువచ్చి నాటుకోవడానికి భూమిని సిద్ధం చేశాను.

– చింతా రామయ్య, రైతు, రాచమల్లపాడు గ్రామం, వెల్దుర్తి మండలం



వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

22న మెగా జాబ్ మేళా

చిలకలూరిపేట: నిరుద్యోగులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 22న చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న జాబ్ మేళా పోస్టర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఏకంగా 4.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదన్నారు. ఈ నెల 22న మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, వల్లభ మిల్క్ ప్రొడక్ట్స్, మాస్టర్ మైండ్స్, ఎపెక్స్ సొల్యూషన్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్, అపోలో ఫార్మసీ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు వివరించారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఏదైనా డిగ్రీ చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజలతో మర్యాదగా మెలగాలి

నేర సమీక్షలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ప్రజలతో మర్యాదగా మెలగాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ, మిస్సింగ్ తదితర కేసుల దర్యాప్తులో పురోగతి కనిపించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యపానంపై నిత్యం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సారా తయారీ, క్రయవిక్రయాలపై నిఘా ఉంచి అరికట్టాలని చెప్పారు. కేసుల ఛేదనకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమీక్షలో ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్ర రాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్‌కే చంద్రశేఖర్, ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ, డీఎస్పీలు కేవీ మహేష్, బి.ఆదినారాయణ, పల్లపు రాజు, యు.రవిచంద్ర పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాపు నేస్తం కోసం 22లోగా దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: వైఎస్సార్ కాపు నేస్తం కోసం అర్హులైన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు ఈ నెల 22వ తేదీ లోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఐదేళ్లపాటు రూ.75 వేలు అందజేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో 31,596 మంది అర్హులైన వారికి 1, 2, 3వ విడతలుగా రూ.47.39 కోట్లు పంపిణీ చేసినట్టు వివరించారు. ప్రభుత్వం ఇప్పుడు నాలుగో విడతగా అర్హులైన వారికి అందజేసేందుకు షెడ్యూలు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆయా కులాల మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యార్డుకు 35,689 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 35,689 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 34,771 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,500 వరకు పలికింది.

ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.11,000 నుంచి 22,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 10,000 నుంచి రూ. 26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,721 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.


22న చిన్నారులకు ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఉమ్మడి గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన అండర్–8, 10, 12 జిల్లా స్థాయి ఫెన్సింగ్ జట్లు ఎంపికకు సంబంధించిన పోటీలు నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి డి.అశోక్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు గుంటూరు రూరల్ మండలం పొత్తూరు గ్రామంలోని ఆక్మే స్కూల్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే చిన్నారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ తీసుకురావాలని పేర్కొన్నారు. వివరాలకు 70755 08842 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ప్లస్‌టూ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్లస్ టూ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు గురువారం ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ–2, కామర్స్–2, జువాలజీ, మ్యాథ్స్ ఒక పోస్టు చొప్పున భర్తీ చేసేందుకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సేవా పుస్తకంతో హాజరు కావాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అర్హత ఆధారంగా నియామక ఉత్తర్వులు ఇస్తామని పేర్కొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 517.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.80 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,000, గరిష్ఠ ధర రూ.2,100, మోడల్ ధర రూ.1,500 వరకు పలికింది.

అర్జీదారులను చిరునవ్వుతో స్వాగతిద్దాం

- వేగంగా సమస్యలు పరిష్కరిద్దాం
- 'జగనన్నకు చెబుదాం' సమీక్షలో కలెక్టర్ శివశంకర్



కలెక్టరేట్‌లో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: అర్జీదారులను చిరునవ్వుతో స్వాగతించి వారి సమస్యలు వేగంగా పరిష్కరిద్దామని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేకాధికారులతో కలిసి కలెక్టర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలను సకాలంలో సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ఆదేశించారు. సంతృప్తస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రికార్డులు ఎప్పటికప్పుడు పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. వీలైనంత వరకు అర్జీలు రీ–ఓపెన్ వరకు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రతి నెలా రెండో, నాలుగో మంగళవారాల్లో మండలస్థాయి సమీక్ష నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకరావు పాల్గొన్నారు.

గుంటూరు ఏఎంసీ చైర్మన్‌గా రాజనారాయణ



కొరిటిపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణ, వైస్ చైర్మన్‌గా షేక్ మాబు సుభానీ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్వర్వులు జారీ చేసింది. వీరితోపాటు పల్లా శ్రీనివాసరావు, మొహమ్మద్ ఫరూక్, కోట గంగా భవాని, కోల అన్నపూర్ణ, కె.నాగలక్ష్మి, కె.విజయ మాధవి, పి.సుశీల, షేక్ సల్మా, బి.వెంకటేశ్వరరావు, జి.ప్రభుదాసు, ఎం.సతీష్ కుమార్, జి.అరుణ, కె.శివసాంబిరెడ్డి డైరెక్టర్లుగా నియమితులయ్యారు. అలాగే మార్కెట్ యార్డులో సభ్యులైన డీసీఎంఎస్ చైర్‌పర్సన్, గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సహాయ సంచాలకులతోపాటు కొత్త పాలకవర్గం సంవత్సరం పాటు కొనసాగనుంది.

రైతులకు అండగా ఉంటా

ఈ సందర్భంగా కొత్త చైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ మిర్చి రైతులకు మంచి ధర లభించేలా చూస్తామన్నారు. రైతులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. అందరి సహకారంతో గుంటూరు మార్కెట్ యార్డును అన్ని రంగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా నూతన పాలకవర్గం కృషి చేస్తుందని చెప్పారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా తనను ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పేరు నిలబెడతానని స్పష్టం చేశారు. ఈ నెల 30న వేలాది మంది అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో బాధ్యతలు స్వీకరించి, ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వెల్లడించారు. తనకు మిర్చి యార్డు చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, షేక్ మొహమ్మద్ ముస్తఫా తదితరులకు ఈ సందర్భంగా రాజనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో తొమ్మిది చోట్ల నిత్యావసర విక్రయ కేంద్రాలు

నరసరావుపేట: బహిరంగ మార్కెట్‌లో పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లాలోని తొమ్మిది చోట్ల కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. రైస్, దాల్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఆయా కౌంటర్లలో బీపీటీ బియ్యం కిలో రూ.48, కందిపప్పు కిలో రూ.120 నుంచి రూ.135 లోపు విక్రయించేలా నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. నరసరావుపేటలో మల్లమ్మసెంటర్, ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్‌యార్డు, చిలకలూరిపేటలోని రైతు బజార్, మాచర్లలోని రామాలయం సెంటర్, దుర్గిలోని మెయిన్‌రోడ్డు బస్టాండ్ దగ్గర, పిడుగురాళ్లలో వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపం, గురజాలలోని పులిపాడురోడ్డులోని సప్తగిరి రైస్ మిల్లు, సత్యనారాయణ రైస్ అండ్ జనరల్ మర్చంట్, సత్తెనపల్లిలో మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపు నంబరు 12, వినుకొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో విక్రయ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ సెంటర్ల ద్వారా ఇప్పటివరకు 1668 మందికి 2,639 కిలోల కందిపప్పు, 330 మందికి 4718 కిలోల బియ్యం విక్రయించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పద్మశ్రీ కోరారు.

వరహాపురం వచన వైడూర్యం

- అద్భుత ప్రజ్ఞాశాలి శ్రీరమణ
- తొమ్మిదేళ్ల వయసులోనే సాహిత్యంలో సత్తా
- హాస్య చతురతకు పెట్టింది పేరు



బాపు-రమణలతో శ్రీరమణ

తెనాలి: కథ, నవల, హాస్యవచన రచయితగా రాణించి అద్భుత ప్రతిభ చాటిన శ్రీరమణ సొంతూరు బాపట్ల జిల్లా వేమూరు మండలం వరహాపురం. ఆయన 1952లో జన్మించారు. అసలు పేరు రాధాకృష్ణ. తండ్రి వంకమామిడి సుబ్బారావు ఉపాధ్యాయుడు. మగపిల్లలు లేని తాత, పీయూసీ చదివేటప్పుడు దత్తు తీసుకున్నాక రాధాకృష్ణ కాస్తా కామరాజు రామారావు అయ్యారు. రెండుపేర్లతో తంటా ఎందుకని శ్రీరమణగా స్థిరపడ్డారు. చిన్నప్పటి నుంచి ఆయనకు పుస్తకాలంటే పిచ్చి. తండ్రి ప్రోత్సాహంతో తొమ్మిదేళ్లనాడే ఆంధ్ర సారస్వత పరిషత్ 'తెలుగువిశారద'లో ప్రథముడిగా వచ్చారు.

బాపట్లలో పీయూసీ

సొంతూరు వేమూరులో చదువు తర్వాత శ్రీరమణ బాపట్లలో పీయూసీ చదివారు. రామకృష్ణ మిషన్ జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో హైస్కూలు నుంచి కాలేజి వరకు వరుసగా ఆరేళ్లపాట ప్రథమ బహుమతిని అందుకున్న ఘటికుడు. రామకృష్ణ మిషన్ ఆహ్వానంపై హిమాలయాల్లోని ఆశ్రమంలో కొంతకాలం గడిపారు. కళాతపస్వి సంజీవదేవ్ సాన్నిహిత్యంతో ఆయన 'రసరేఖ'లో ఎందరో ప్రముఖులను కలుసుకున్నారు. నండూరి రామమోహనరావు ప్రోత్సాహంతో పేరడీలు రాశారు. తెలుగు వైతాళికుల వచన రీతుల్ని అక్షరాలా అనుకరిస్తూ వచనంలో పేరడీ ప్రక్రియను 1974లో ఆరంభించి గుర్తింపును తెచ్చుకున్నారు. 'వీడెవడోగాని నన్ను మహబాగా పట్టుకున్నాడురోయ్' అని విశ్వనాథ సత్యనారాయణ మెప్పు పొందారు. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ దినపత్రికల్లో పనిచేశారు. నవ్య వారపత్రిక సంపాదకుడిగా చేశారు.

బాపు, రమణలతో సాన్నిహిత్యం

బాపు, ముళ్లపూడి వెంకటరమణ ద్వయం ఆహ్వానంతో శ్రీరమణ వారి రచనా బృందంలో చేరారు. 'మనవూరి పాండవులు'తో సహా పలు సినిమాలకు రచనా సహకారం అందించారు. శ్రీపాద సుబ్రహ్మణ్యం రచనలు, సంజీవదేవ్ జీవనమార్గం, బాపు–రమణల వ్యక్తిత్వం, సృజనాత్మకత తనకు స్ఫూర్తి అని చెప్పేవారు. ఈ క్రమంలో దాదాపు పాతికేళ్ల క్రితం రాసిన 'మిథునం' కథతో జాతీయ బహుమతిని గెలిచారు. 'నాతిచరామి' అనే రుషిప్రోక్తమైన వివాహమంత్రానికి అప్పదాసు అచ్చతెలుగులో జీవించి చెప్పిన భాష్యం 'మిథునం'. అనేక భాషల్లోకి అనువాదమైన ఈ కథ 3.5 లక్షల కాపీలు ముద్రితమైంది. తెలుగు కథాసాహిత్యంలో సమున్నత స్థానం అందుకుంది. ప్రసిద్ధ మలయాళ రచయిత ఎంటీ వాసుదేవ నాయర్ దీనిని 'ఒరు ఉరి పుంజరి' పేరుతో సినిమా తీశారు. 2012లో తెలుగు నటుడు, రచయిత తనికెళ్ల భరణి పూనుకుని ఈ కథను తెలుగులో తెరపైకి తెచ్చారు. భరణితోపాటు నటీనటులు ఎస్పీ బాలు, లక్ష్మికి, యూనిట్ సభ్యులకు ప్రశంసలతోపాటు పలు అవార్డులనూ తెచ్చిందీ సినిమా. గోవా అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లోనూ ప్రదర్శితమైంది. ఆస్కార్ అవార్డు కమిటీ ఎదుట ప్రదర్శనకు అర్హతను పొందింది.

వ్యంగ్య రచనలో మేటి

'రంగుల రాట్నం'తో కాలమిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు శ్రీరమణ. 'బంగారు మురుగులు' కథతో కథకుల జాబితాలోకి ఎక్కారు. 'మిథునం'తోపాటు 'ధనలక్ష్మి', 'సోడానాయుడు' మరికొన్ని కథలు ప్రశంసలనందుకున్నాయి. వివిధ పత్రికల్లో శ్రీకాలమ్, శ్రీచానల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలిరేకులు, టీకప్పులో సూర్యుడు, జేబులో బొమ్మ, వెంకట సత్యస్టాలిన్ శీర్షికలను నడిపారు. చివరగా 'సాక్షి'లో 'అక్షర తూణీరం' కాలమ్ నిర్వహించారు. వ్యంగ్య రచనలో తనకు తానే సాటి అనిపించుకున్నారు. ప్రేమపల్లకీ నవల, శ్రీచానెల్– 1, శ్రీచానెల్–2 హాస్యసంపుటాలు, మొదటి పేజీ, శ్రీరమణ మానవ సంబంధాలు, శ్రీరామాయణం (తేటతెలుగులో), సింహాచలం సంపెంగలు (కథాసంకలనం), సరసమ్.కామ్ (హాస్య కదంబాలు) రాశారు. హాస్య రచన విభాగంలో తెలుగు విశ్వ విద్యాలయం నుంచి 2014లో కీర్తి పురస్కారాన్ని స్వీకరించారు.

జీవన వి'రమణ'

శ్రీరమణ ఏడు పదుల వయసులో బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం మధ్యాహ్నం అక్కడి మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఈటీవీలో అసత్య కథనం
- చంద్రబాబు, లోకేష్, మాజీ ఎమ్మెల్యే జీవీ పథకం ప్రకారమే తప్పుడు ఆరోపణలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు, నారా లోకేష్, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పథకం ప్రకారం అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములు బ్యాంక్‌లో తనఖా పెట్టి రూ.53 కోట్లు తాను లోను తీసుకున్నట్లు ఈటీవీలో వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ విజయవాడ బ్రాంచిలో తనకు అకౌంట్ లేదని, ప్రజాప్రయోజన వ్యాజ్యం పేరుతో తనపై కోర్టులో దాఖలు చేసిన సర్వే నంబర్లకు తన భూములకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అలాంటప్పుడు నేను లోను ఎలా తీసుకుంటానని ప్రశ్నించారు. వార్తా కథనాలు ప్రసారం చేసేటప్పుడు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. మల్బారి అగ్రోటెక్ వద్ద 2016లో తాను భూములు కొనుగోలు చేశానని, అప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉందని చెప్పారు. కావాలనే తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక టీడీపీ నాయకులు పచ్చమీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. తాను ఎక్కడా ఒక్క సెంటు కూడా ప్రభుత్వ భూమి కొనలేదని, దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. అసత్య కథనాలు ప్రసారం చేసినవారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తాను ఎమ్మెల్యే కాకముందే భూములు కొనుగోలు చేశానని, ఇప్పుడు ఎమ్మెల్యే ప్రభుత్వ భూములు కొన్నారని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వార్తా కథనాలు ప్రసారం చేసిన వారూ స్వయంగా తనపై విచారణ చేసుకోవచ్చని, బ్యాంక్ ఖాతానే లేనప్పుడు రుణం ఎలా తీసుకుంటానని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక పథకం ప్రకారం అభివృద్ధి పనులను కోర్టులో వేసి అడ్డుకోవడమే కాకుండా తనపై వ్యక్తిగతంగా కూడా సంబంధం లేని వ్యక్తులతో కేసులు వేయిస్తున్నారని ఆరోపించారు. తప్పుడు వార్తలు ప్రసారం చేయడం కాదని, తన అభిప్రాయాలు కూడా ప్రసారం చేయాలని సూచించారు. ప్రజాక్షేత్రంలో తమను ఎదుర్కొనలేక నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ గుండాల స్వెనోమ్, చిన్న తరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించి జిల్లాను రాష్ట్రంలో ముందు వరసలో ఉండేలా ఐసీడీఎస్ సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సీడీపీఓలు, సూపర్‌వైజర్ల సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐసీడీఎస్ పర్యవేక్షకులు, అంగన్‌వాడీ వర్కర్లు శ్రద్ధ, క్రమశిక్షణతో పనిచేయలని కోరారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సంపూర్ణ వివరాలు సేకరించాలని చెప్పారు. రక్త హీనత ఉన్న మహిళలను గుర్తించి వారికి అవసరమైన అప్పుడే వండిన ఆహారాన్ని అందించాలని కోరారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందించాలన్నారు. జిల్లాలో బరువు తక్కువగా ఉన్న పిల్లలు సుమారుగా 2,249 మంది ఉన్నారని చెప్పారు. ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలు సుమారుగా 3,468 మంది ఉన్నారని వివరించారు. వారికి సకాలంలో పోషక ఆహారాన్ని అందించాలని చెప్పారు. నాడు– నేడు కింద జిల్లాలో నిర్మాణంలో ఉన్న 13 అంగన్‌వాడీ కేంద్రాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ అవసరమన్నారు. ఆర్‌సీహెచ్ ఐడీ డేటా అప్లోడ్ చేయాలన్నారు. నిత్యావసరాలు వంద శాతం అందజేయలని చెప్పారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఐసీడీఎస్ ఏపీఎం ఉమామహేశ్వరి, వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ నాగ పద్మజ పాల్గొన్నారు.

ప్రజల జీవన విధానంలో మార్పుకు కృషి

నరసరావుపేట: ప్రజల జీవన విధానంలో మార్పుకు పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(డీ.ఆర్.డీ.ఏ) సంస్థలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకానికి, జగనన్న పాల వెల్లువ పథకంతో అనుసంధానం చేసి స్వయం సహాయక సంఘాల జీవన విధానంలో మార్పులు తీసుకురావాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో బ్యాంకు ఖాతాలకు, ఆధార్ కార్డుల అనుసంధానం, సకాలంలో రుణాలను అందించడం, జగనన్న పేదలందరికీ ఇల్లు, టిడ్కో గృహ నిర్మాణ పథకం, జగనన్న పేదలందరికీ పథకంలో సొంత గృహాలను నిర్వహించుకునే మహిళలకు వారి ఆర్థిక స్తోమత మేరకు తప్పనిసరిగా రుణాలను అందించే ప్రక్రియ చేపట్టి, ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తప్పనిసరిగా వ్యాపారాలు పెట్టేలా తగిన ప్రోత్సాహం అందించడం తో పాటు, సకాలంలో బ్యాంకు రుణాలు అందించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు జరుగుతున్న సమయంలో అమ్మఒడి పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న నిధులను పిల్లల విద్యా అవసరాలకు ఖర్చు పెట్టేలా మహిళల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. బాలికల్లో ప్రధానంగా రక్త హీనత (ఎనీమియా) సమస్య జిల్లాలో ఎక్కువగా ఉన్న దృష్ట్యా వారికి ప్రతిరోజు గుడ్డు, పాలు అందించేలా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని చెప్పారు. మగ పిల్లలకు సంబంధించి అట్లాస్, స్పోర్ట్స్ షూస్, చేతి గడియారం(హ్యాండ్ వాచ్), అవసరమైన పుస్తకాలు కొని ఇవ్వాలని, జనవరిలో జరిగే పర్యాటక ప్రాంతాల సందర్శనకు, వారిలో నైపుణ్యా శక్తిని పెంపొందించే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బాలు నాయక్ పాల్గొన్నారు.

గొడవకు కారకులు టీడీపీ నాయకులే..

- నిష్పక్షపాతంగా వ్యవహరించిన పోలీసులు, రెవెన్యూ అధికారులు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఆరోపణలు అవాస్తవం
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: కోటప్పకొండ రోడ్డులో చోటుచేసుకున్న ఘర్షణకు కారకులు టీడీపీ వారేనని, ఈ విషయంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సక్రమంగానే వ్యవహరించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివారెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గొడవకు వైఎస్సార్ సీపీ కారణమని, కేసుల నమోదులో పోలీసులు పక్షపాత వైఖరి ప్రదర్శించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వాస్తవాలేమిటో తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. గత టీడీపీ ప్రభుత్వం కంటే ఇప్పుడే పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

టీడీపీ హయాంలో..

గతంలో కాకానిలో పొలం విషయంలో తలెత్తిన ఘర్షణలో ఒక వ్యక్తి హత్యకు గురికాగా, అప్పటి ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ గ్రామంలోని ఐదుగురు టీడీపీ వ్యక్తులపై కేసు నమోదు చేయించి రిమాండ్‌కు పంపారన్నారు. దీనికి కక్షగా అప్పటి స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఎస్పీని బదిలీ చేయించి ఇంటికి పంపించి ఈ వ్యవహారంలో ఏమాత్రం సంబంధంలేని 16 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయించి రౌడీషీట్లు పెట్టించాడని గుర్తు చేశారు. ఐదేళ్లపాటు గ్రామంలో రాకుండా చేశారన్నారు.

ముప్పాళ్ల ఎంపీపీ ఎన్నికలో..

ముప్పాళ్ల ఎంపీపీ ఎన్నికలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను పోలీసుల సహాయంతో బలవంతంగా అపహరించి బలంలేకపోయినా తమ వ్యక్తిని ఎంపీపీ చేసుకున్న ఘనత వారిదేనన్నారు. ప్రస్తుత విషయంలో గత కొంతకాలంగా ఇంటిని ఆక్రమించి దానిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంది టీడీపీ నాయకుడు చల్లా సుబ్బారావు అని, అది ప్రశ్నించేందుకు వెళ్లిన బాధితులపై కర్రలతో దాడి చేసి చంపుతామని బెదిరించింది అరవిందబాబేనని పేర్కొన్నారు. దీంతో పాటు రాళ్లు తొలుత రువ్వి వైఎస్సార్ సీపీ వారిని కవ్వించింది అరవిందబాబు కారు డ్రైవరేనని వెల్లడించారు. తాను చివరి సమయంలో వెళ్లానని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరినీ సముదాయించి తీసుకొచ్చి పార్టీ కార్యాలయంలో ఉంచానన్నారు.

నా వీడియోలు ఉంటే బయటపెట్టండి

తాను ఎక్కడైనా దాడికి పాల్పడినట్లు ఒక్క వీడియో బయటపెట్టాలని టీడీపీ వారిని కోరారు. ఈ ఘటనలో టీడీపీ వారు దాడికి పాల్పడుతున్న వీడియోలను ఎమ్మెల్యే గోపిరెడ్డి విలేకరులకు చూపించారు. బాధితులు అందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో వివాదానికి కారణమైన ఇంటిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో చల్లా సుబ్బారావుపై దాడే ఎవరు దీనికి బాధ్యులనే విషయం స్పష్టం చేస్తుందన్నారు. తలకు గాయమై కుట్లు వేయించుకొని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడన్నారు. ఇటువంటి దాడులు మరోసారి జరగకుండా టీడీపీ వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులందరికీ న్యాయం చేయాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి కోరారు. కొల్లా సాంబశివరావు అనే వ్యక్తి తనపై కావాలని అనవసర ఆరోపణలు ఎస్పీ వద్ద చేశాడని, వాస్తవానికి అతను పమిడిపాడు గ్రామంలో 69 మంది వద్ద అప్పులు చేసి నష్టాలపాలయ్యాడన్నారు. అతడి బంధువులే అతడిని తప్పుపడుతూ ప్రకటనలు ఇచ్చారని గుర్తు చేశారు. టీడీపీ నాయకుల కుయుక్తులను ప్రజాబలంతో ఎదుర్కొంటామని ఎమ్మెల్యే వివరించారు.

ఏసీఏ సెంట్రల్ జోన్ క్రికెట్ విజేత గుంటూరు

రన్నరప్‌గా కృష్ణాజిల్లా

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సెంట్రల్ జోన్ అంతర జిల్లాల సీనియర్ పురుషుల వన్డే లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గుంటూరు జిల్లా సత్తా చాటింది. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఏసీఏ మైదానాల్లో మూడు రోజుల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లలో వరుస విజయాలతో అత్యధికంగా ఎనిమిది పాయింట్లు సాధించి విన్నర్‌గా నిలిచింది. నాలుగు పాయింట్లతో కృష్ణాజిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. నాలుగు పాయింట్లతో ప్రకాశం జిల్లా మూడో స్థానంలో, జీరో పాయింట్లతో పశ్చిమగోదారి జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. ఈ నెల 17వ తేదీన ప్రారంభమైన ఈ టోర్నీకి ఈ నాలుగు జట్లు ప్రాతినిధ్యం వహించాయి. తొలి రోజు జరిగిన మ్యాచ్‌లలో ప్రకాశం జట్టుపై కృష్ణా జట్టు, పశ్చిమగోదావరి జట్టుపై గుంటూరు జట్టు గెలిచాయి. రెండవ రోజు మ్యాచ్‌లలో కృష్ణా జట్టుపై గుంటూరు, పశ్చిమగోదావరి జట్టుపై ప్రకాశం జట్టు గెలిచాయి. మూడవ రోజు బుధవారం జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. దీంతో రన్‌రేట్ ఆధారంగా విజేతలను నిర్ణయించారు. గుంటూరు జట్టు 2.2471, కృష్ణా జట్టు 1.1772, ప్రకాశం జట్టు 0.5833, పశ్చిమగోదావరి జట్టు మైనస్ 3.7000 రన్‌రేట్‌ను సాధించాయి.

తూకంలో తేడాలపై 24 కేసులు నమోదు

నెహ్రూనగర్: తూకంలో తేడాలు వస్తే వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ టి.షాలేం రాజు పేర్కొన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు వ్యాపార సముదాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. తూకంలో తేడాలు గమనించారు. బియ్యం, కందిపప్పు, వంట నూనె తదితర వస్తులపై ఉండాల్సిన వెయిట్ కన్నా తక్కువ వెయిట్ ఉండటంపై 24 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ ద్వారా కాటాలకు స్టాంపింగ్ వేయించుకోవడంతో పాటు నాణ్యమైన కాటా ద్వారా ప్రజలకు సరుకులు అందజేయాలని సూచించారు. తనిఖీలలో లీగల్ మెట్రాలజీ అధికారులు అల్లారయ్య, కొండారెడ్డి, సునీల్‌రాజు, జన సైదా, శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం

కొరిటిపాడు(గుంటూరు): బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ వద్ద ఆల్ ఇండియా బ్యాంకుల ఎంప్లాయిస్ యూనియన్(ఏఐబీఈఏ) జిల్లా అధ్యక్షుడు రవి చంద్రారెడ్డి ఏఐబీఈఏ పతాకాన్ని ఆవిష్కరించారు. యూనియన్ ముఖ్య సలహాదారుడు పి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకులలో తక్షణమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. సామాన్యులు పొదుపు చేసుకొనే సేవింగ్స్ బ్యాంకు అకౌంట్స్‌కు ఇచ్చే వడ్డీ రేట్లు పెంచాలని కోరారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఏఐబీఈఏ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మురళీ, సయ్యద్ బాషా, శివాజీ, షరీఫ్, క్రాంతి, పావని, పృథ్వీ, కుమార్ పాల్గొన్నారు.



సంఘు జెండా ఎగురవేసిన అనంతరం మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్

దమ్మాలపాడు(ముప్పాళ్ల): ముసురుతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ పేర్కొన్నారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామాన్ని బుధవారం సందర్శించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాల వలన పల్లం ప్రాంతాలు, కాలువల్లో మురుగు నీరు చేరి నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఇంటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే కూలర్స్, ఇంటిపైన, వాటర్ ట్యాంకులు, కొబ్బరిబొండాలు, ఇంటి ముందు కాలువలో అన్నం, కూరలు, చెత్తా, చెదారం వేయకూడదన్నారు. గ్రామాలలో చేపట్టిన జ్వరాల సర్వేను వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది సహకారంతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా 25 మందికి రక్త పరీక్షలు చేశారు. జ్వరం వస్తే అవసరమైన రక్త పరీక్షలు గ్రామంలోని ఏఎన్ఎం చేస్తారన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారి సీహెచ్ ప్రభాకరరెడ్డి, సూపర్‌వైజరు కె.వి.నాగమల్లేశ్వరరావు, ఎ.పీటర్‌డేమియన్, హెచ్.వి.జోస్పిన్, సీహెచ్‌ఓ రహిమూన్, పాల్గొన్నారు.



దమ్మాలపాడులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్

పెయింటర్లకు ప్రాణం పోసిన సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: ఒక అద్భుతమైన బొమ్మను గీసి.. అద్భుతంగా తీర్చి దిద్దటం ఒక పెయింటర్‌కే సాధ్యమని.. అలాంటి పెయింటర్లకు ప్రాణం పోసిన ఘనత మాత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ది పెయింటింగ్(ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని పెయింటింగ్ కళాకారులు బుధవారం బృందావన్‌గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఆయన్ను కలసి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ఫ్లెక్సీ బోర్డులు, ఫ్లెక్స్ మిషన్ల రాకతో పనులు లేక పస్తులతో సతమతమవుతున్న పెయింటింగ్ కళాకారుల దీనస్థితిని అర్థం చేసుకుని నగరాల సుందరీకరణ, నాడు– నేడు, స్కూల్స్ వాల్ ఆర్ట్స్ పనుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందికి సీఎం జగన్ ఉపాధి కల్పించారని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వాల్ ఆర్ట్స్ సైన్ బోర్డ్స్ పెయింటింగ్ పనులు దళారీ వ్యవస్థతో సంబంధం లేకుండా నేరుగా కళాకారులకు ఉపాధి కల్పించాలని కోరారు. కళాకారులుగా తమ ను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.10వేలు వచ్చేలా చూడాలని విన్నవించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి వరికుంట రాజేష్, కోశాధికారి బొల్లవరపు వెంకట రామకోటేశ్వరరావు, గౌరవ సలహాదారులు రాపర్ల వినోద్‌చౌదరి, చెన్నం కళ్యాణ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గాజుల శివశంకరరావు, సహాయ కార్యదర్శి హెప్సిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని సత్కరిస్తున్న పెయింటర్స్ అసోసియేషన్ నేతలు

ముగిసిన జీవన నైపుణ్యాల శిక్షణ తరగతులు

యడ్లపాడు: ప్రతి విద్యార్థి జీవన నైపుణ్యాలు పెంపొందించుకునేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని చెప్పారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్‌సీఈఆర్‌టీ, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న ప్రారంభమైన జీవన నైపుణ్యాలపై శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. పల్నాడు జిల్లాలోని 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పీడీ/పీఈటీలతో పాటు యాక్టివ్ టీచర్లు సుమారు 100 మంది హాజరయ్యారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన డైట్ కళాశాల లెక్చరర్స్ వీరికి 11 రకాల జీవన నైపుణ్యాలపై సమగ్ర అవగాహన కల్పించారు. తొలివిడత గుంటూరు జిల్లాలోని 50 పాఠశాలలకు శిక్షణ అందించగా, మలివిడత పల్నాడు జిల్లాలోని 50 పాఠశాలల ఉపాధ్యాయులకు అందించినట్లు వెల్లడించారు. ఫౌండేషన్ సౌత్‌ఇండియా టీం సభ్యులు శిక్షణ లక్ష్యం గురించి వివరించారు. డైట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.ప్రసాద్, కె.యోగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.



ముగింపు సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు, డైట్ లెక్చరర్స్, శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

రికార్డు స్థాయిలో తగ్గిన పేదరికం

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు పాలన వల్ల మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పేదరికం తగ్గిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ రేగుల్లంకలో భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారంఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన పేదరికపు సూచీలో గతంలో 11.5 శాతం ఉండగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజారంజక పాలన వల్ల 6 శాతానికి తగ్గడం చాలా గొప్ప విషయమన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో పాలన సాగించడం వలనే ఇది సాధ్యమైందన్నారు. చంద్రబాబు కుయుక్తులు ప్రజలు నమ్మరని, ఊసరవెల్లిని మించిపోయిన ఆయన పూటకో విధంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాజకీయాల్లో చీడపురుగు లాంటివారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తుంటే ఉచిత పథకాలు సోమరులను తయారు చేస్తున్నాయని విమర్శించిన చంద్రబాబు, మహానాడులో మాట మార్చి జగన్ కంటే మిన్నగా ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మరోపక్క ఆయన కుమారుడు లోకేష్ తాము అధికారంలోకి వస్తే జగన్ స్కీంలన్నీ తీసేస్తామని చెప్పారని, ఇలా తండ్రీ కొడుకులు ఎవరేమి మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని మేరుగ విమర్శించారు. చంద్రబాబు, ఆయనకు మద్దతు తెలుపుతున్న పార్టీలన్నీ నీటి బుడగ పార్టీలని విమర్శించారు. దళిత వ్యతిరేకి చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఆయనను దళితులు నమ్మరని చెప్పారు. విద్య, వైద్యం, సంక్షేమం ద్వారా తమ బతుకులు మార్చిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించేందుకు ఎదురు చూస్తున్నారని మంత్రి చెప్పారు. సమావేశంలో అవనిగడ్డ, పామర్రు శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు, కై లే అనిల్‌కుమార్, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్‌సీపీ యువనేత సింహాద్రి వికాస్ పాల్గొన్నారు.



అసెంబ్లీ హామీల అమలు కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీ ఆన్ గవర్నమెంట్ అష్యూరెన్స్ కమిటీ సభ్యుడిగా తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నియమితులయ్యారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో శివకుమార్‌తో పాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇటీవల 2023–24 సంవత్సరానికిగాను మొత్తం ఐదు కమిటీలను నియమించారు. ఇందులో ప్రభుత్వ హామీల కమిటీ ఒకటి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇంతకుముందు ఉన్న అసెంబ్లీ, శాసనమండలి జాయింట్ కమిటీల్లోనూ సభ్యుడిగా ఉన్న విషయం తెలిసిందే. కమిటీ ఆఫ్ ఎమినిటీస్‌లో ఎమ్మెల్యే శివకుమార్ సభ్యుడిగా ఉన్నారు. ఇదే కమిటీలో 2023–24 సంవత్సరానికి కూడా ఆయన్ను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో రాష్ట్ర అసెంబ్లీ కమిటీ, జాయింట్ కమిటీలోనూ ఎమ్మెల్యే శివకుమార్ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

రేపు శాస్త్రవేత్త క్లైర్లీతో ఐలవరం విద్యార్థుల ఆన్‌లైన్ సమావేశం

ఐలవరం(భట్టిప్రోలు): స్విట్జర్లాండ్ దేశంలోని బ్రూక్ హెవెన్ ల్యాబ్‌లో పార్టికల్ ఫిజిక్స్‌గా పనిచేస్తున్న క్లైర్లీ ఈనెల 21వ తేదీన భట్టిప్రోలు మండలం ఐలవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సంభాషించనున్నారు. ఆమె ప్రస్తుతం ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తున్న అట్లాస్ ఎక్స్‌పర్‌మెంట్ ప్రాజెక్ట్‌లో కీలక శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఆమె ఇప్పటికే ఖగోళ, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన ఎన్నో అంతుచిక్కని అంశాలపై ఉపన్యాసాలు చేశారు. ఐలవరం హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ నాసాలోని శాస్త్రవేత్తగా పనిచేసిన జిమ్ ఆడమ్స్ ద్వారా ఆమెను ఆన్‌లైన్‌లో కలిసి తమ విద్యార్థులతో సంభాషించాలని కోరగా అందుకు అంగీకరించారు. ఈ కార్యక్రమాన్ని బాపట్ల జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని ఆయా హైస్కూల్ విద్యార్థులు ఆమెతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకోనున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.మోహనరావు బుధవారం తెలిపారు.